క్లుప్తంగా

తప్పిన ప్రమాదం



కోనేరులో పడిన జేసీబీ

పాలకొండ: పట్టణంలోని వెంకటరాయుని కోనేరు వద్ద గురువారం పెను ప్రమాదం తప్పింది. కోనేరు అభివృద్ధి పనుల్లో భాగంగా జేసీబీలతో మట్టిని తొలగిస్తున్న గట్టు కూలి పోయి జేసీబీ కోనేరులోకి పడిపోయింది. డ్రైవర్ తృటిలో తప్పించుకుని ప్రాణాలతో బయటపడగలిగాడు. మరో రెండు జేసీబీల సాయంతో కోనేరులో పడిన జేసీబీని బయటకు తీశారు.

భామినిలో భారీ వర్షం



నేరడి - బిలో కురుస్తున్న భారీ వర్షం

భామిని: మండలంలో గురువారం భారీ వర్షం కురిసింది. రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఖరీఫ్ వరి, పత్తి పంటల్లో ఎరువుల చల్లడం, కలుపు నివారణ, గొప్పులు పెట్టడంలో రైతులు బిజీగా ఉన్నారు. మరో వైపు కొద్ది రోజులుగా ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలు వర్షంతో ఉపశమనం పొందారు.

లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేక పూజలు



వివిధ రకాల పుష్పాలంకరణలో లక్ష్మీ నృసింహస్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖి నదీ తీరాన వేంచేసిన వేణుగోలస్వామి ఆలయప్రాంగణంలో కొలువుదీరిన లక్ష్మీనృసింహ స్వామి ప్రత్యేక అంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి ప్రీతికరమైన గురువారం తెల్లవారుజామున ఆలయప్రధాన అర్చకుడు పీసపాటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు స్వామిని వివిధ రకాలపూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఉదయం 6 గంటలనుంచి క్యూలోఉన్న భక్తులతో అర్చకులు ప్రత్యేక పూజలు చేయించారు. దూర ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

తప్పిన పెను ప్రమాదం



బెల్లిడి గ్రామ సమీపంలో ఢీకొట్టుకున్న ఆర్టీసీ బస్సు - లగేజ్ వ్యాన్

గుమ్మలక్ష్మీపురం: ఆర్టీసీ బస్సు, లగేజ్ వ్యాన్ ఎదురెదురుగా వస్తూ ఢీకొట్టుకున్న సంఘటన గుమ్మలక్ష్మీపురం మండలంలో చోటుచేసుకొంది. ఎల్విన్‌పేట పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గురువారం సాయంత్రం పార్వతీపురం ఆర్టీసీ డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సు మూలిగూడ గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా, కురుపాం నుంచి కొందుకుప్ప వైపు వెళ్తున్న లగేజ్ వ్యాన్ గుమ్మలక్ష్మీపురం మండలంలోని బెల్లిడి గ్రామ సమీపంలోని మలుపువద్ద ఎదురెదురుగా వస్తూ ఢీకొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో ఇరు వాహనాల్లో ఉన్న ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదని తెలిపారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

విద్యార్థులకు స్టడీమెటీరియల్ పంపిణీ

పార్వతీపురంటౌన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు అధ్యాపకుడు తెర్లి రవికుమార్ సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను ప్రిన్సిపాల్ జె. రామారావు గురువారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు సులభమైన రీతిలో అర్థమయ్యేలా ప్రచురించిన పుస్తకాలను పంపిణీ చేశారని తెలిపారు. ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమన్నారు.

సర్పంచ్ అభ్యర్థికి మద్దతుగా ఎమ్మెల్యే ప్రచారం

- గుమ్మలో గోపాలరావును గెలిపించండి
- ముగిసిన ప్రచారం



గుమ్మ గ్రామంలో సర్పంచ్ అభ్యర్థి గోపాలరావుకు మద్దతుగా ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, పరీక్షిత్‌రాజు

కురుపాం: గుమ్మ సర్పంచ్ ఉప ఎన్నికలో వైఎస్సార్ సీపీ బలపరిచిన ఆరిక గోపాలరావును గెలిపించాలని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు కోరారు. ఈ నెల 19న శనివారం సర్పంచ్ పదవికి ఉప ఎన్నిక జరగనుండగా ప్రచారం గురువారంతో ముగిసింది. చివరి రోజు ప్రచారంలో ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, పరీక్షత్‌రాజు పాల్గొన్నారు. గోపారావుకు మద్దతుగా గుమ్మలో విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి వెళ్లి సర్పంచ్ బరిలో ఉన్న ఆరిక గోపాలరావును మంచం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత, వైస్ ఎంపీపీ బిడ్డిక అన్నాజీరావు, ఎంపీటీసీలు టీవీఎస్ స్వామియాజులు, వెలమల బంగారునాయుడు, మాజీ ఎంపీప బొడ్డుదొర దమయంతి, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇందిరాకుమారి, జిల్లా కో ఆప్షన్ సభ్యుడు నిషార్, పార్టీ మండల కన్వీనర్ గౌరీశంకరరావు, వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు శెట్టి నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు అంధవరపు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల్లో దిద్దుబాట్లు ఉండకూడదు..



ఆర్థిక వ్యవహారాలపై సూచనలిస్తున్న ఎల్‌సీ

భామిని: మహిళా సంఘాల రికార్డుల్లో దిద్దుబాట్లు ఉండడం చట్టరీత్యా నేరమని వెలుగు లీగల్ అడ్వయిజర్ నాగభూషణనాయుడు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఎంఎంఎస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు నిమ్మల నీలమ్మ, జగుశెట్టి జ్యోతి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఆర్థిక విధానాలు, అమలు చర్యలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో పలు సూచనలు చేశారు. గ్రామైఖ్య సంఘం, మండల సమాఖ్య సంఘాల్లో ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ పాలసీని వివరించారు. ఎంఎంఎస్ కార్యవర్గం, వీఓ అధ్యక్షుడు, సీసీలు, సీఓలు, వీఓఏలు పాల్గొన్నారు.

మోతాదు మించొద్దు...

పాలకొండ రూరల్: వరి పంటకు కీలక దశలో అందిస్తున్న ఎరువుల మోతాదు మించకుండా రైతులు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయాధికారి ఎన్నివాహని సూచించారు. మండలంలోని శివారు గ్రామాల్లో పంట భూములను గురువారం పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాల ప్రభావంతో పాలకొండ – వీరఘట్టం రహదారిలో పంట భూముల్లోకి నీరు చేరింది. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నీరు బయటకు వెళ్లే మార్గాలు ఏర్పాటు చేయాలన్నారు. పంట తాజా పరిస్థితిని గుర్తించి అవసరమైన ఎరువులను అధికారుల సూచనలతో వాడాలన్నారు. ఆలస్యంగా ఉడుపులు నిర్వహిస్తున్న రైతులు నాట్లు వేసే సమయంలో కాలిబాటలు ఏర్పాటు చేయటం మంచిదని సూచించారు.

ఏపీఎన్‌జీఓ మహాసభల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



ఏపీ ఎన్‌జీఓ మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: విజయవాడలో ఈ నెల 21, 22 తేదీల్లో జరగనున్న ఏపీ ఎన్‌జీఓల మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం పాలకొండ డివిజన్ గౌరవాధ్యక్షుడు ఇ.లిల్లీపుష్పనాథం పిలుపునిచ్చారు. వండవలోని ఎమ్మెల్యే కళావతి క్యాంపు కార్యాలయంలో మహాసభల వాల్‌పోస్టర్లను ఆమె గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీఓ సంఘం నాయకులు కె.రంగాచారి, పి.ఈశ్వరరావు, జె.రమేష్, జి.నాయుడు, బి.అనుష్ పాల్గొన్నారు.

పక్కాగా టేక్ హోం రేషన్



అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచనలిస్తున్న సీడీపీఓ

గుమ్మలక్ష్మీపురం: గర్భిణులు, బాలింతలు అందిస్తున్న టేక్ హోం రేషన్ (ఇంటి వద్దకే పౌష్టికాహారం)ను పక్కాగా అమలుపర్చాలని భద్రగిరి సీడీపీఓ సీహెచ్ సుశీలాదేవి అన్నారు. తన ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలతో తన కార్యాలయం వద్ద గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టేక్ హోం రేషన్‌ను నెలలో రెండు దఫాలుగా అందజేస్తున్నందున, వాటిని అందించే ముందు ఫేస్ రికగ్నైజ్ యాప్లో నమోదు

చేసుకోవాలన్నారు. చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల వద్దనే పౌష్టికాహారాన్ని అందజేయాలని, సమయపాలన పాటించాలన్నారు. ప్రీ స్కూల్ పిల్లల్లో చదువుపై ఆశక్తి పెరిగేలా ఆటపాటలతో విద్యాబోధన చేపట్టాలని, ప్రతీ నెలా చిన్నారుల ఎత్తు, బరువులు నమోదు చేయాలని, రికార్డులన్నీ సక్రమంగా నిర్వహించాలంటూ సూచించారు. సమావేశంలో సూపర్‌వైజర్లు శ్రీదేవి, ఈశ్వరమ్మ, ఉనీషా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



బీటీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని జర్న పంచాయతీ చినవంకదార గ్రామానికి బొద్దిడి రోడ్డు నుంచి బీటీ రోడ్డు నిర్మాణానికి కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి గురువారం భూమి పూజ చేశారు. 1.4 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణానికి ఎంజీఎన్ ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.90 లక్షలు మంజూరైందని, గిరిజన గ్రామాలన్నింటికీ రోడ్డు సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రాధాన్యత క్రమంలో దశల వారీగా ఆయా పనులు చేపట్టనున్నట్లు ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలియజేశారు. తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కోసం ఏన్నో ఏళ్ల నుంచి ఎదురు చూస్తున్నామని, ఎట్టకేలకు తమ గ్రామానికి రోడ్డు నిర్మాణం కానుండటం పట్ల చినవంకదార గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కుంబురుక దీనమయ్య, జెడ్పీటీసీ మండంగి రాధిక, వైస్ ఎంపీపీలు నిమ్మక శేఖర్, లక్ష్మణరావు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, ఎస్సీ, ఎస్టీ సెల్ మండల కన్వీనర్లు సామల మాధవరావు, తోయక గోపాల్, జర్న మాజీ ఎంపీటీసీ కొండగొర్రి రాజేష్, పలువురు సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులతో పాటు టీడబ్ల్యూ డీఈఈ సింహాచలం, ఏఈ శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

ప్రకృతి సాగు బాట పట్టాలి

- డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్



ప్రకృతి వ్యవసాయ సాగుపై సూచనలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం మండలాన్ని ప్రకృతి వ్యవసాయ పద్ధతుల సాగులో ఆదర్శ మండలంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నందున ప్రతీ రైతును ప్రకృతి సాగు బాట పట్టించేందుకు కృషి చేయాలని డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ అన్నారు. ఏపీసీఎన్‌ఎఫ్ డీపీఎం పి.షన్ముఖరాజు గుమ్మలక్ష్మీపురం వైటీసీలో గ్రామ సమాఖ్య వీఓఏలకు, ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్‌పీలకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీఆర్‌డీఏ పీడీ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయడం వలన తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని, తద్వారా ఆరోగ్యకరమైన పంటల దిగుబడిని పొందడమే కాకుండా ఆదాయం కూడా పుష్కలంగా లభిస్తుందని, ఈ విషయాలపై గ్రామాల్లో సన్న, చిన్నకారు రైతులను గుర్తించి, అవగాహన కల్పిస్తూ, వారిని ప్రకృతి సాగు వైపు మళ్లించి, శతశాతం ప్రకృతి వ్యవసాయ మండలంగా తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం అదనపు ప్రబంధకులు ధనుంజయ వివిధ పంటల నమూనాలు, వాటి ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అడ్డాకుల చిన్నారావు, జట్టు వ్యవస్థాపకుడు డి.పారినాయుడు, ఎంఎంటీలు జి.నిర్మలాదేవి, నరసింహ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో జూదరులు

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి గ్రామంలో పేకాట ఆడుతున్న 14 మందిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్‌ఐ కళాధర్ తెలిపారు. గ్రామస్తులు ఇచ్చిన ముందస్తు సమాచారం మేరకు గురువారం సిబ్బందితో కలిసి రైడింగ్ చేయగా 14 మంది పేకాట ఆడుతుండగా పట్టుకున్నామని, వారి నుంచి రూ.1,15,530 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కళాధర్ తెలిపారు.

తుమరాడలో..

పాలకొండ రూరల్: మండలంలోని తుమరాడ గ్రామంలో గురువారం ఓ పశువుల పాకలో పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారంతో దాడి నిర్వహించినట్లు ఎస్‌ఐ బి.శివప్రసాద్ తెలిపారు. ఈ దాడిలో 9 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. వీరి నుంచి రూ.16,290 నగదును స్వాధీన పర్చుకున్నామని తెలిపారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగినట్టు తెలిస్తే సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కోరారు. అటువంటి వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు.

అమ్మఒడి లబ్ధిదారుల ఈకేవైసీ వేగవంతం

సీతానగరం: రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మఒడి పథకం ద్వారా లబ్ధిపొందనున్న పిల్ల తల్లులకు సంబంధించిన ఈకేవైసీ నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఈఓపీఆర్డీ కె.కుమార వర్మ కోరారు. ఈ మేరకు మండలంలోని బళ్లకృష్ణాపురం, బగ్గందొరవలస, గెడ్డలుప్పి సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను గురువారం పరిశీలించారు. అనంతరం గెడ్డలుప్పి సచివాలయంలో సర్పంచ్ ఎ. తిరుపతిరావు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనుల నిర్వహణ, అమ్మ ఒడి ఈకేవైసీ తదితర అంశాలపై సచివాలయ ఉద్యోగులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వర్షాలు కురవడంవల్ల ఇళ్లలో దోమల బెడద ఎక్కువగా ఉంటుందని, దోమల నివారణకు సర్పంచ్‌ల సమక్షంలో పంచాయతీ కార్యదర్శులు దోమల నివారణ మందు పిచికారీ చేయాలని కోరామని తెలిపారు. గెడ్డలుప్పిలో నిర్మాణంలో ఉన్న సచివాలయం, రైతుభరోసా భవనం నిర్మాణాలను పరిశీలించారు. డిజిటల్, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ సహాయకులు అమ్మ ఒడి లబ్ధిదారులకు నిర్దేశించిన గడువులోగా విధిగా ఈకేవైసీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కె. సత్యనారాయణ, ఉపసర్పంచ్, సచివాలయ కన్వీనర్లు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

చెరువులో గంబూషియా చేప పిల్లల విడుదల



చెరువులో గంబూషియా చేప పిల్లలను విడిచి పెడుతున్న వైద్య సిబ్బంది

కురుపాం: మలేరియా నివారణలో భాగంగా కురుపాం గ్రామ సమీపంలో ఉన్న చెరువుల్లో గంబూషియా చేప పిల్లలను విడిచిపెడుతున్నామని కురుపాం మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్.నారాయణరావు అన్నారు. గురువారం ఆయన ఆధ్వర్యంలో పలు చెరువుల్లో చేప పిల్లలను విడిచిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెరువుల్లో ,నీటి గుంటల్లోను దోమల ఉత్పత్తి పెరగకుండా దోమలు పెట్టే గుడ్లను, లార్వాలను గంబూషియా చేపలు ఆహారంగా తినటం వలన దోమల ఉత్పత్తి తగ్గుతుందని మలేరియా, డెంగీ వ్యాధులు ప్రబలకుండా అరికట్టవచ్చునన్నారు. కురుపాం సబ్ యూనిట్ పరిధిలో ఉన్న ఐదు పీహెచ్‌సీల్లో కూడా దోమల నివారణకు గంబూషియా చేప పిల్లలను విడిచిపెడుతున్నట్లు తెలిపారు. ఎంటీఎస్ పి.ఆదినారాయణ, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు సర్వే



బీఎల్వోలకు సూచనలిస్తున్న సబ్ కలెక్టర్

గుమ్మలక్ష్మీపురం: ఓటరు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని పాలకొండ సబ్ కలెక్టర్ నూరల్ కమర్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ముందుగా ఇప్పటి వరకు చేపట్టిన ఓటరు సర్వే ప్రగతిపై ఆరా తీసారు. ఓటర్ల జాబితాలో తప్పులు, మరణించిన వారి పేర్లు, ఒకే ఇంటి నంబర్‌పై ఎక్కువ ఓట్లు ఉంటే వాటిని కూడా క్షుణ్ణంగా పరిశీలించి తేడాలు గమనించినట్లయితే తొలగించాలని ఆదేశించారు. కొత్త ఓటర్లుంటే చేర్చుకోవాలని, ఈ ప్రక్రియను ఈ నెల 21వ తేదీలోగా పూర్తి చేసి, ఆన్‌లైన్లో పొందుపర్చాలని సూచనలు చేశారు. సమావేశంలో తహసీల్దార్ జె.రాములమ్మ, ఉప తహసీల్దార్ రాజేంద్ర పాల్గొన్నారు.

తుమరాడలో నేత్ర వైద్య శిబిరం



రోగులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పాలకొండ రూరల్: మండలంలోని తుమరాడ గ్రామంలో గురువారం నిర్వహించిన డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా కంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వంద మందికి పరీక్షలు నిర్వహించారు. వారిలో 45 మందిని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ద్వారా ఉచిత శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. గ్రామ సర్పంచ్ పి.శోభారాణి పర్యవేక్షణలో చేపట్టిన శిబిరంలో ఆప్తాల్మిస్ట్ జాక్సన్ కంటి పరీక్షలు చేశారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, హోలీక్రాస్, నవజీవన్(తిరుపతి) వారు తమ వంతు సేవలు అందజేశారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఎస్.వెంకటరమణ, పి.హరిబాబు, ఎం.సాయికుమార్, సీహెచ్ వెంకటరమణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాలగేయ సారస్వతం పుస్తకం ఆవిష్కరణ



బాలగేయ సారస్వతం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ దీనమయ్య

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని మండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాలక దేవానంద్ రచించిన చెల్లిరావే బంగారు తల్లి రావే.. అనే పాటను బాలగేయ సారస్వతం అనే పుస్తకంలో ప్రచురించారు. ఈ మేరకు ఆ పుస్తకాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద గురువారం ఎంపీపీ కుంబురుక దీనమయ్య, జెడ్పీటీసీ మండంగి రాధికతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ దేవానంద్ మాస్టార్ రచించిన పాటను పుస్తకంలో ప్రచురించడం సంతోషదాయకమని, భవిష్యత్తులో మరిన్ని పాటలు రచించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులతో పాటు రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, ఇరిడి సర్పంచ్ వాసుదేవరావు పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణ మాస ప్రారంభ పూజలు

- అమ్మవారికి ఎమ్మెల్యే కళావతి ప్రత్యేక పూజలు



అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కళావతి

పాలకొండ: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ ఆలయంలో గురువారం శ్రావణ మాస ప్రారంభ పూజలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, దేవదాయశాఖ డీసీ సుజాత పూజల్లో పాల్గొన్నారు. ఉదయం 10 గంటలకు అమావాస్య గడియలు పోయి శ్రావణ మాసం రావడంతో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతలు అందించిన బంగారు అభరణాలను అమ్మవారికి అలంకరించారు. అనంతరం ఎమ్మెల్యే అమ్మవారి శ్రావణ మాస తొలి పూజను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రావణ మాసంలో ఆలయం ఎటువంటి సమస్యలు లేకండా భక్తులకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ సుజాత మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి దాతలు సహకరించడం ఆనందంగా ఉందని తెలిపారు. తమ శాఖ నుంచి ఆలయానికి కావాల్సిన వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పూజల్లో పట్టణంలోని పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

వసతిగృహ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు తనిఖీలు నిర్వహిస్తున్న డీఐఓ జగన్‌మోహన్‌రావు

కొమరాడ: వసతిగృహ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు అన్నారు. మండలంలోని పెదఖేర్జిలలో ఉన్న గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆరోగ్య వివరాలు నమోదు చేసి రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల్లో హిమోగ్లోబిన్ రక్తపరీక్షల ఫలితాలను పరిశీలించారు. సిక్ రూమ్‌లో ఉన్న విద్యార్థుల ఆరోగ్యాన్ని పరిశీలించారు. విద్యార్థులందరికీ అల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. అనంతరం సీతామాంబపురం గ్రామ సమీపంలో ఉన్న చెరువులో వైద్య సిబ్బంది చేపలు విడిచిపెట్టే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ చేపలు దోమల లార్వాలను తినేస్తాయని, తద్వారా మలేరియా, డెంగీ జ్వరాలకు కారణమైన దోమల నివారణ సాధ్యపడుతుందన్నారు. స్థానిక వైద్యుడు సీహెచ్ అరుణ్‌కుమార్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో మెరుగైన వైద్య సేవలు



సీహెచ్‌సీకి వచ్చిన గర్భిణులు

కురుపాం: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం ద్వారా మెరుగైన సేవలు అందుతున్నాయని వైద్యాధికారిణి బి.శోభారాణి అన్నారు. గురువారం సామాజిక ఆరోగ్య కేంద్రానికి రోగుల తాకిడి ఒక్కసారిగా ఎక్కువ కాగా వైద్యాధికారిణి శోభారాణి 150 మంది గర్భిణులకు వైద్య తనిఖీలను నిర్వహించి మందులు అందజేశారు. మరో 100 మంది రోగులకు వైద్య తనిఖీలను నిర్వహించి మందులు ఇచ్చారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ ప్రతీ సోమవారం, గురువారం సామాజిక ఆరోగ్య కేంద్రంలో 250 దాటి ఓపీ నిర్వహణ ఉంటుందని కురుపాం, జియ్యమ్మవలస, గుమ్మలక్ష్మీపురం, కొమరాడ మండలాల నుండి అధిక సంఖ్య రోగులు వస్తున్నారని తెలిపారు. ప్రతీ ఒక్కరికి మెరుగైన వైద్య సేవలు అందించడమే తమ ముందున్న లక్ష్యమన్నారు.